**పెళ్ళాం, పిల్లల్ని భరించేవాడు భర్త అయితే, మరి ఏనాడూ, ఏరకంగానూ వారిని భరించనివాణ్ణి ఏమనాలి? అలాంటి ఆ 'భర్త' మహాశయుడికి చివరికి ఆమె చెప్పిన గుణపాఠం ఏమిటి?**



# నీ చేతిలో విద్య

ఆ రోజు ఎనిమిదో రోజు ప్రకాశం ఇంట్లోంచి వెళ్ళిపోయి. మొదటి రోజు రాత్రి ఇంటికి ఎంతకీ రాని మొగుణ్ణి తిట్టుకుంటూ పడుకుంది శారద. ఎవరితో వచ్చి తాగుతున్నాడో, పేకాడుతున్నాడో అంటూ ఇల్లు పట్టని మొగుణ్ణి తిట్టుకుంది. మర్నాడు ఉదయానికీ రాకపోతే ఏ స్నేహితుడింట్లోనో పడుకుని అట్నించి అటు ఆఫీసుకి పోయాడేమోనని సరిపెట్టుకుంది. ఆ రాత్రీ ఇల్లు చేరకపోయేసరికి గాబరాపడింది.

పిల్లల్ని తెలిసున్న ఇళ్ళకి పంపింది. అతని స్నేహితులన్నవాళ్ళందరికీ ఫోన్లు చేసింది. నిన్న అతను వాళ్ళెవరి ఇళ్ళకీ వెళ్ళలేదన్నది విని గాబరాపడిపోయింది. ఊళ్ళో ఉన్న తమ్ముణ్ణి పిలిపించింది. ఇరుగు పొరుగు చేరారు. చర్చలు జరిపారు. నాలుగైదు ఆస్పత్రులకి యాక్సిడెంట్ కేసుల గురించి వాకబు చేశారు. అనుమానం వచ్చిన చోట వెళ్ళి చూసి, కాదని తేల్చుకున్నారు. రేపు ఆఫీసుకి వెళ్ళి వాకబు చేస్తానన్నాడు తమ్ముడు. పోలీస్ కంపెంట్ ఇమ్మన్నారు కొందరు. రేపు ఆఫీసులో అడిగి ఏదన్నా పని మీద ఎక్కడికన్నా పంపారేమో తేల్చుకున్నాక పోలీస్ కంప్లైంట్ ఇవ్వాలని నిర్ణయించారు.

మర్నాడు ఆఫీసువాళ్ళు చెప్పింది విని నిర్ఘాంతపోయాడు తమ్ముడు. జాబ్‌కి వారం కిందటే రిజైన్ ఇచ్చేసి, అతనికి ఆఫీసు నుంచి రావాల్సిన మొత్తాలని వసూలు చేసుకున్నాడుట. ఫారిన్‌లో మంచి ఆఫర్ వచ్చింది, వెళతానని చెప్పాడట. ఫ్యామిలీకి ఈ విషయం తెలియదని విని వాళ్ళూ ఆశ్చర్యపోయారు. ఏ దేశం? ఏ ఉద్యోగం అన్న వివరాలు తమకీ తెలియవన్నారు.

కబురు విని శారద ప్రాన్పడిపోయింది. మాట మాత్రమైనా చెప్పకుండా ఇలా హఠాత్తుగా మాయమవడం ఎందుకు అన్నది ఎవరికీ అంతుబట్టలేదు. విదేశాలకి ఉద్యోగానికి వెళితే ఇంట్లో చెప్పకుండా వెళ్ళడం ఏమిటి? మళ్ళీ వస్తాడా? రాడా? భార్యాపిల్లల్ని ఇలా హఠాత్తుగా వదిలేసి వెళ్ళడం ఎందుకు ఉద్యోగానికైతే? ఎన్ని రకాలుగా అంతా ఆలోచించినా ప్రకాశం చర్య ఎవరికీ అర్థం కాలేదు. ఆఖరికి పోలీస్ రిపోర్ట్ ఇవ్వాలని నిర్ణయించారు.

'అతనంతటతను వెళితే మేం ఏం చెయ్యగలం? ఎక్కడున్నాడని వెతకుతాం? మిస్సింగ్ పర్సన్ కింద కేసు రాయండి. వీలైనంతవరకు ప్రయత్నిస్తాం' అన్నారు. గత వారంలోగా విదేశాలకి వెళ్ళిన వారి పేర్లు పరిశీలించారు. అందులో ప్రకాశం పేరు లేదు. మారు పేరుతో వెళ్ళాడా? వెళితే ఏ పేరు మీద వెళ్ళాడు? అసలింతకీ ఇలా ఇంట్లో చెప్పాపెట్టకుండా ఎక్కడికి వెళ్ళినట్టు?

పెద్దన్నగారింట్లో ఉన్న తల్లికి కబురెళ్ళి ఆవిడ వచ్చింది. శారద రాగాలు ఆరంభించింది. ఎవరూ ఏం చెయ్యలేరన్నది అందరికీ అర్థం అయింది.

ఇదంతా జరిగిన ఎనిమిదో రోజుకి ప్రకాశం నుంచి ఓ ఉత్తరం వచ్చింది. అందులో ముచ్చటగా మూడే వాక్యాలు. తన కోసం వెతకవద్దనీ, తాను ఏ దేశం, ఎక్కడికి వెళుతున్నదీ ఎవరికీ చెప్పదలచలేదనీ, ఇంక తాను తిరిగి రాకపోవచ్చనీ, భార్యాపిల్లలకి ఆ ఇల్లు మాత్రమే తానివ్వగలిగిందనీ, ఇకపై వారి బాధ్యత తనది కాదనీ రాశాడు. ఎక్కడి నుంచి రాశాడో చిరునామా లేదు. బహుశా వెళ్ళేముందు రాసి పడేసి ఉండవచ్చని ఊహించారు.

శారద ఆ ఉత్తరం చూసి ఘొల్లుమంది.

"ఇదేం విడ్డూరం. కట్టుకున్న పెళ్ళాంపిల్లల్ని నట్టేట్లో వదిలి మీ కర్మ అంటూ తన దారి తాను చూసుకుంటాడా! పెళ్ళాడి పదేళ్ళు కాపురం చేసి ఇప్పుడు బాధ్యత నాది కాదు అంటాడా!" తమ్ముడు ఎగిరాడు. తల్లి అల్లుణ్ణి శాపనార్థాలు పెట్టింది.

"ఇదేం బొమ్మల పెళ్ళా? ఊరకుంటాం అనుకున్నాడా?" తమ్ముడు ఆవేశంగా అరిచినా ఎవరేం చెప్పగలరు? ఎక్కడికి వెళ్ళాడో, ఈ ప్రపంచంలో ఏ దేశంలో ఉన్నాడో తెలియకుండా ఏం వెదుకుతారు? ఏం బుద్ధి చెపుతారు?

"ఇంకెవర్తినో మరిగినట్లున్నాడు. మళ్ళీ రానని చెప్తున్నాడంటే ఇంకెవర్తినో పెళ్ళాడి వెళ్ళుంటాడు. లేకపోతే దొంగచాటుగా వెళ్ళాల్సిన అవసరం ఏమిటి? ఇక్కడుంటే భార్య ఉండగా ఇంకో పెళ్ళి నేరం అని చెప్పాపెట్టకుండా మారుపేరు పెట్టుకుని ఎవరినో పెళ్ళాంగా చూపించి తీసుకుపోయాడు." దూరపు వరస పెదతండ్రి అన్నాడు.

"ఏడాది నుంచి ఆయన నాతో సరిగా లేరమ్మా. ఆయన విసుగులు, కోపాలు, కసరడాలు, తిట్టడాలు రోజురోజుకీ ఎక్కువయ్యాయి. ఏమిటో అనుకున్నాను. ఆయన ఎవరితోనో సంబంధం పెట్టుకున్నారని ఊహించలేకపోయాను. ఈ ఏడాదిలో నా ఒంటి మీద చెయ్యి కూడా వెయ్యలేదు. ముందు నుంచి నేనంటే ఆయనకి గిట్టదు. పల్లెటూరి మొద్దుననీ, చదువు లేనిదాన్ననీ ఆయనకి లోకువ. ఇప్పుడింకా కాస్త ఎక్కువైందనుకున్నాను గానీ ఇలా నట్టేట ముంచుతారని అనుకోలేదు." శారద కళ్ళు తుడుచుకుంటూ అంది.

ఇప్పుడామెకి దుఃఖం స్థానే అవమానం, కసి చోటుచేసుకున్నాయి. ఆ దగా, మోసం సహించలేక ఉక్రోషం పెల్లుబికింది.

"ఈయనగారు నా అందం పెళ్ళిచూపులప్పుడు చూడలేదు గాబోలు. నాకా డిగ్రీలు లేవని, మెట్రిక్ ఫెయిలయ్యానని అప్పుడు తెలీదు గాబోలు. మాటకి ముందు 'అందరాడవాళ్ళూ చక్కగా చదువుకుని ఉద్యోగాలు చేస్తూ భర్తలకి సాయపడ్తా'రని చిన్నబుచ్చడం, హేళన చెయ్యడం. 'మెట్రిక్ పరీక్షలకి కట్టి తగలడు' అని ఎత్తిపొడుపులు. ఓసారి కోపం వచ్చి 'పెళ్ళికి ముందు చూసి, నచ్చి చేసుకున్నారు. నచ్చకపోతే ఎవరు 'చేసుకోమన్నారు' అని తిరగబడ్డానని చేయిచేసుకున్నారు..."

"ఇదంతా ఇప్పుడా చెప్పడం? నీతో తిన్నగా లేడని అమ్మతో అయినా చెప్పావా?" తమ్ముడు ఎగిరాడు.


"చెబితే ఏం చేసేవారేమిట్రా. 'సర్దుకోవాలమ్మా, మంచిగా మొగుణ్ణి మార్చుకోవాలమ్మా' అని నీతులు చెప్పేవారు. అమ్మే మీ ఇంట్లో పడి ఉంది. నన్నూ, పిల్లల్ని మీరేమన్నా ఆదుకునేవారా? ఇద్దరు పిల్లల తల్లిని కాపురం వదులుకుని ఎక్కడికి పోతానని అన్నీ సహించి పడున్నాను నాకో గతి లేక." ఉక్రోషంగా అంది శారద.

అంతా మౌనం వహించారు. ఆ మాట నిజమే. తండ్రి లేడు. తల్లి అన్నదమ్ములిద్దరి దగ్గరా ఉంటోంది. శారదని ఎవరు ఆదుకుంటారు? శారద పిల్లల గతి ఏమిటన్నది ఎవరికీ అర్థం కాలేదు. ఉండడానికి ఇల్లంటూ ఉంది గుడ్డిలో మెల్లగా. కానీ, వీళ్ళు ఎలా బతకాలి? ఉద్యోగం చేసుకు బతికే చదువు లేదు. అన్నదమ్ములు ఎన్నాళ్ళు ఆదుకోగలరు?

ఊళ్ళో ఉన్న నేరానికి బాధ్యత తన నెత్తిన ఎక్కడ పడ్తుందోనన్నట్లు 'అన్నయ్యని పిల్చి మాట్లాడు, మళ్ళీ వస్తా' అంటూ జేబులోంచి అయిదువందలు తీసి తల్లి చేతిలో పెట్టి జారుకున్నాడు తమ్ముడు.

'అన్నయ్యతో మాట్లాడి మళ్ళీ వస్తానే' అంటూ

చిత్రాలు: నర్సిం



తల్లి తానో నాలుగొందలు కూతురి చేతిలో పెట్టి వెళ్ళింది.

చేతిలో తొమ్మిది వందల రూపాయలతో, ఇద్దరు చిన్న పిల్లలతో ఒంటరిగా నడిసముద్రంలో తుపానులో చిక్కుకున్న నావలా నిలబడింది ఆనాడు శారద.

* * *

ఎదుటి ఫ్లాట్‌లో ఉండే సునంద కనుక ఆనాడు తనకి ఆ సలహా ఇచ్చి ఉండకపోతే తన గతేమయ్యేది అని రోజుకి ఓసారన్నా అనుకుంటుంది శారద ఈనాటికీ, నాలుగేళ్ళు గడిచినా.

సునంద, శారద ఎదురెదురు ఇళ్ళల్లో ఉండడంతో వారిద్దరి మధ్య మంచి స్నేహం కుదిరింది. సునంద చదువుకున్నదనీ, బ్యాంక్ ఉద్యోగస్థురాలనీ శారదకి గౌరవం. శారద అమాయకత్వం, ఆప్యాయంగా తనకి అన్నింట్లో సాయపడే ఆమె మనస్తత్వం సునందకి అభిమానం. ఆమె ఆఫీసుకి వెళితే పనిమనిషి, పాలవాడు, చాకలి ఎవరొచ్చినా తాళం తీసి పని చూపేది శారద. పిల్లలు స్కూల్ నుంచి రాగానే తాళం తీసి వాళ్ళచేత బట్టలు మార్పించి సునంద పెట్టిన పాలు, టిఫిన్లు తినిపించేది. అలా ఒకరికొకరు అవసరాల్లో సాయపడే స్నేహమే తనని గట్టెక్కించింది అనుకుని సునందకి రోజూ మనసులోనే దేవుడికి దణ్ణం పెట్టుకున్నట్లు దణ్ణం పెట్టుకుంటుంది శారద.

అంతా వెళ్ళాక వచ్చిన సునందని పట్టుకుని బోరున ఏడ్చింది శారద. 'చదువు లేదు, డబ్బు లేదు ఎలా బతకాలి? ఈ పిల్లల్ని ఏం చెయ్యాలి? ఎలా పెంచాలి' అని బెంబేలు పడి ఏడుస్తున్న శారదని ఓదార్చి, ధైర్యం చెప్పింది సునంద.

"శారదా! బతకడానికి చదువే అక్కరలేదు. ఆఫీసులో చేసేదే ఉద్యోగం కాదు. జీవనోపాధికి లక్ష మార్గాలున్నాయి. నీకొచ్చిందే చేయచ్చు."

"నాకేం వచ్చు వంట తప్ప." అయోమయంగా, నిస్పృహగా అంది శారద.

"కరెక్ట్. అదే చేయి. చదువు లేదని ఇప్పుడు వగస్తే ఏం లాభం! నీకొచ్చింది, నీచేతిలో విద్య వంట. అదే చేయి."

"వంటలక్క పనా! వంట చేయాలా ఎవరింట్లోనో...! ఇంత బతుకు బతికి - అవమానంగా" అంది శారద.

"నీవెవరి ఇంటికీ వెళ్ళి చెయ్యనక్కరలేదు. నీవు వండుకునేదే మరో నలుగురికి సరిపోయేట్లు వండు. ఒంటరిగా ముసలి వయసులో పిల్లలకి దూరంగా ఉండి, ఆరోగ్యం సరిగా లేని ఇద్దరు దంపతులున్నారు నాకు తెలిసినవారు. వారు పిల్లల దగ్గరకి అమెరికా వెళ్ళరు. డబ్బుండి వంటమనుషులని పెట్టుకున్నా, ఎవరూ సరిగా చెయ్యక, ఇల్లు మ్యానేజ్ చేసుకోలేని ఆ ముసలి దంపతులకి నీవు రెండు పూటలా వండి పంపించాలి. వాళ్ళకి మడి, ఆచారం. బయటి భోజనం తినరు. తిన్నా ఈ వయసులో పడదు. అంచేత రెండు పూటలా మామూలుగా పప్పు, కూర, పులుసు, పచ్చడి లాంటి వంట నీవింట్లో చేసి వారికి క్యారియర్లో పెట్టి పంపితే చెరి పదిహేను వందలు ఇచ్చేట్లు మాట్లాడాను. చూడు శారదా! మీ ఆయన ఇంట్లోంచి వెళ్ళిపోయాడని విన్న దగ్గరనుంచి నీవెలా బతకాలి అన్న ఆలోచనే నన్ను నిలవనీయలేదు. ఆఖరికి నాకు తట్టిన ఆలోచన ఇది. నీ సమస్యా, వారి సమస్యా తీరుతుంది. నెలకి మూడు వేలు వెంటనే వస్తుంది. నీవు రుచిగా, శుచిగా చేస్తే ఈ మాట తెలిసి ఉద్యోగం చేసుకుంటూ ఒంటరిగా ఉండే అమ్మాయిలు, బ్యాచిలర్ అబ్బాయిలు, ఇలాంటి ముసలివారు - ఎందరో ముందుకి వస్తారు. ఏ పని అయినా నిజాయితీగా చేస్తే ఆత్మగౌరవంతో బతకవచ్చు. ఏ పనినీ ఆత్మన్యూనతగా అనుకోవద్దు. జీవనోపాధి కోసం నీవీ పని చేస్తే నీకొచ్చిన అవమానం ఏమీలేదు" అంటూ ప్రోత్సహించి, ధైర్యం చెప్పి, ఇంటి ముందు 'ఇచ్చట ఇంటి భోజనం సప్లయ్ చేయబడును' అన్న బోర్డు పెట్టించింది. తమ ఇంటి పురోహితుని కొడుకు చదువబ్బక తిరుగుతుంటే, బ్యాంక్‌లో పని ఇప్పించమని ఎప్పటినుంచో పోరుతూ ఉంటే ఆయన్ని ఒప్పించి, క్యారియర్లు సప్లయ్ చేయడానికి పెట్టింది.



ప్రకాశం తన ఉత్తరంలో తన కోసం వెతకవద్దనీ, తాను ఏ దేశం వెళుతున్నదీ ఎవరికీ చెప్ప దలచలేదనీ, ఇంక తాను తిరిగి రాక పోవచ్చనీ, ఇక కుటుంబం బాధ్యత తనది కాదనీ రాశాడు.

రెండో నెలలోనే నలుగురు ఉద్యోగం చేసే అమ్మాయిలు, ముగ్గురు ఉద్యోగం చేసుకునే బ్యాచిలర్స్, నలుగురు స్టూడెంట్లు, ఇంకో ఇద్దరు ముసలి దంపతులు, ఆ పరిసరప్రాంతాల్లో ఉండేవారు శారద భోజన సప్లయ్ మాట విని వచ్చారు. ఉక్కిరిబిక్కిరి చేసేటన్ని ఆర్డర్లు రెండు నెలల్లో వచ్చాయి.

ఇంటి భోజనం, రోజూ మార్పుతో, రుచిగా వండి క్యారియర్లో పెట్టి ఇంటికి పంపడంతో శారద భోజనం అందరికీ వరం అయింది. రెండో నెలలో ఖర్చులు పోను పదివేలు మిగిలేసరికి శారద నమ్మలేకపోయింది.

బతకడం ఇంత సులువని ఎన్నడూ ఊహించని శారద ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బు అయింది. తన మీద తనకో నమ్మకాన్ని, ఓ వ్యక్తిత్వాన్ని ఆపాదించిన సునంద మేలు మరిచిపోనంది. పాతిక, ముప్పై క్యారియర్లు పంపవలసి రావడంతో ఒక్కర్తీ చేసుకోలేక తన కింద ఓ బీద అమ్మాయిని సాయానికి పెట్టుకుంది.

"శారదా! ఈనాటి క్వాలిటీ, శుచి, శుభ్రత నీవు ఎప్పటికీ మెయిన్‌టైన్ చెయ్యగలిగితేనే నీ బిజినెస్ నిలబడుతుందన్నది మర్చిపోకు. నాలుగు డబ్బులు రాగానే పనివాళ్ళమీద వదిలేస్తే వచ్చిన పేరు పోవడానికి నిమిషం పట్టదన్నది నీవు గుర్తుంచుకోవాలి" అని చెప్పేది సునంద.

నెలకో కొత్త ప్రపోజల్‌తో వచ్చేది సునంద. నాలుగు నెలలు గడిచేసరికి టిఫిన్ సెక్షన్ ఓపెన్ చేయించింది.

ఇంట్లో చోటు చాలడం లేదని కింద ఓ గ్యారేజి అద్దెకి తీయించి వంటపని అక్కడకి మార్పించింది. కొన్ని ఆఫీసులకి మధ్యాహ్నం లంచ్ టైములో టిఫిన్లు ఇడ్లీ, వడ, ఉప్మాలాంటివి సప్లయ్ చేసే ఓ కంట్రాక్టర్‌కి శారద సరకు సప్లయ్ చేస్తే, డిస్ట్రిబ్యూషన్ అతను చూసుకుంటాడు. వాళ్ళిచ్చిన హాట్ క్యారియర్లలో రెడీ చేసి పెడితే వాళ్ళే వచ్చి తీసుకునేటట్టు రేటు మాట్లాడి కుదిర్చింది సునంద. దానివల్ల ఎస్టాబ్లిష్‌మెంట్ అక్కరలేకుండా కంట్రాక్టర్‌కి లాభం. డిస్ట్రిబ్యూషన్ చూసుకోవాల్సిన ప్రాబ్లమ్ శారదకి ఉండదు.

యాభై క్యారియర్లు, టిఫిన్ సెక్షన్ ఓపెన్ అయ్యాక ఓ వంటవాడు, ఓ హెల్పరు, ఓ పనిమనిషిని పెట్టుకోవాల్సి వచ్చింది. శారద వంట సంగతి తెలిసి చిన్న చిన్న ఫంక్షన్లు, పుట్టిన రోజులు, బారసాలలు, చిన్న ఎంగేజ్‌మెంట్లకి 'పాతిక ముప్పై మందే! వండితే మేమే వచ్చి తీసికెళతాం' అని ఆ చుట్టుపక్కలవారంతా బలవంత పెట్టడంతో చిన్న వంటలు టేకప్ చేసింది.

సంపాదన పెరిగి, గిరాకీ పెరగడంతో చోటు, పాత్రలు అవి చాలకపోవడంతో పక్క ఫ్లాట్ ఖాళీగా ఉంటే బ్యాంక్ లోన్‌కి తాను పూచీ ఉండి, ఇంటి మీద అప్పుతీసి, ఆ ఫ్లాట్ కొనిపించి, పెద్దపెద్ద స్టవ్‌లు, గిన్నెలు, ఫ్రిజ్‌లు, గ్రైండర్లు - అన్నీ బ్యాంక్ లోను మీద కొనేలా చేసింది సునంద. ఎస్టాబ్లిష్‌మెంట్ పెద్దదై 'శారదా కేటరర్స్ అండ్ సప్లయర్స్' అన్న కేటరింగ్ సంస్థ ఆవిర్భవించింది. పెద్దపెద్ద పెళ్ళిళ్ళకి కూడా ఆర్డర్లు తీసుకోవడం మొదలుపెట్టింది శారద.

నాలుగేళ్ళు తిరిగేసరికి రెండొందల మంది పనివారితో ఊపిరి సలపని ఆర్డర్లతో 'శారదా కేటరింగ్ సర్వీసెస్' మేనేజింగ్ డైరెక్టర్ అయింది శారద. ఆ ఊళ్ళో పేరున్న సంస్థలలో అదీ ఒకటయింది. సునంద ప్రోద్బలంతో 'స్పోకెన్ ఇంగ్లీష్' కోర్సులో చేరి ఆరు నెలల్లో చకచకా ఇంగ్లీష్ మాట్లాడే స్థాయికెదిగింది. ఈనాడు పెద్దపెద్ద ఆఫీసులకి, కంపెనీలకి కాన్ఫరెన్స్‌లకి లంచ్,

బ్రేక్‌ఫాస్ట్, డిన్నర్లు సప్లయ్ చేస్తోంది. ముందు రూము కంప్యూటరు, రిసెప్షనిస్టు, క్లర్కు, అకౌంటెంట్‌లతో ఆఫీసుగా వెలసింది. అన్నీ స్వయంగా చూసుకుంటూ, సునంద చెప్పిన క్వాలిటీ మెయిన్‌టైన్ చేస్తూ రాబడి లక్షల్లోకి పెంచుకుంది.

కూతురు వంట పనులు మొదలెట్టిందని తెలియగానే, 'నీకు సాయంగా ఉంటానే' అంటూ తల్లి దగ్గర చేరింది. ఇల్లు, పిల్లల్ని ఆమెకి అప్పగించి శారద నిశ్చింతగా తన పని చూసుకునేది. శారద బిజినెస్ పెరిగేసరికి తమ్ముడు 'నీ సప్లయ్ వ్యవహారాలు చూస్తాను. నీకు నమ్మకంగా ఎవరన్నా కావాలిగా' అంటూ వచ్చి చేరాడు. బిజినెస్‌లో బంధువుల ప్రమేయం వద్దనుకున్నా జీతం ఇచ్చి పెట్టుకోమని సునంద సలహా ఇచ్చింది.



పెద్ద బిజినెస్ ఎగ్జిక్యూటివ్‌లా ఆఫీసు రూమ్‌లో కూర్చుని చకచకా స్టాఫ్‌కి ఆర్డర్లు ఇస్తూ, కాగితాలు, లెక్కలు చూస్తూ, చెక్కుల మీద సంతకాలు పెట్టే శారదని చూస్తే తాను నాటిన మొక్క తన కళ్ళ ముందే పుష్పించి, ఫలించిన ఆనందం సునందది!

ఇంత చేసిన సునందకి 'నేనేం చేసి నీకు కృతజ్ఞతలు చెప్పను' అంటుంది రోజుకోసారన్నా శారద. 'ఏందుకోనక్కర లేకుండా రోజూ టిఫిన్లు, భోజనాలు, రకరకాలు తినిపిస్తున్నావు. ఇంతకంటే నాలాంటి వాళ్ళకి గొప్ప సాయం ఏముంటుంది' అంటుంది నవ్వుతూ సునంద.

* * *

"శారదా!" ఓ నాడు సునంద హడావిడిగా పరిగెత్తుకు వచ్చింది. "శారదా! మీ ఆయన జాడ తెలిసింది. మస్కట్‌లో ఉన్నాడట. మొన్న మా ఆడబడచుకి ఓ షాపింగ్ కాంప్లెక్స్‌లో కనపడ్డాడట, వెంట ఎవర్తో ఉందిట. ఇప్పుడే ఫోను చేసి చెప్పింది." ఆయాసపడుతూ అంది.


సునంద ఆడపడుచు, భర్త రెండుమూడుసార్లు వచ్చినప్పుడు శారదతో పరిచయం అయ్యారు. ప్రకాశరావునీ చూశారు. వాళ్ళు గత ఏడాది మస్కట్‌లో ఉద్యోగం వచ్చి వెళ్ళారు.

"ఇప్పుడు ఇంక మన తడాఖా చూపిద్దాం. ఎక్కడ ఉద్యోగం చేస్తున్నదీ వాకబు చేసి చెప్పమన్నాను. మనం ఎలాగో పోలీస్ కంప్లెంట్ ఇచ్చాంగా. మనిషి ఫలానా చోట ఉన్నాడని చెప్పి భార్యాబిడ్డల్ని వదలి, వేరే ఆడదానితో ఉన్నాడని 'బైగమీ' చట్టం కింద ప్రొసీడవుదాం. అక్కడ మన ఇండియన్ ఎంబసీలో కంప్లెంట్ ఇద్దాం. అతను పనిచేసే కంపెనీకి కూడా కంప్లెంట్ ఇద్దాం. వెంటనే ఉద్యోగం ఊడబీకి డిపోర్ట్ చేసి పంపిస్తారు. అప్పుడు రోగం కుదురుతుంది. భార్యని ఇంత మోసం చేసిన వాడిని మనం వదలకూడదు." ఉద్రేకంగా అంది సునంద.

సునంద అన్నంత పనీ చేసింది. లాయర్ల సలహాతో, పోలీసుల జోక్యం, ఇండియన్ ఎంబసీ సహకారంతో అతని ఉద్యోగం ఊడబీకించి, దేశం నుంచి పంపేటట్టు చేసి ప్రకాశరావు అంతం చూశారు సునంద, శారద. ప్రకాశరావును ఇండియా రప్పించి 'బైగమీ' చట్టం కింద కోర్టులో కేసు వేయించింది.

దురదృష్టవశాత్తూ శారద అమాయకంగా, తెలివి తక్కువతనంతో ప్రకాశరావు చెప్పిన చోట కొన్ని కాగితాల మీద సంతకాలు పెట్టింది అప్పుడు. 'ఫ్లాటు నీ పేర మారుస్తున్నాను. రిజిస్ట్రేషన్ చేయించాలి' అంటూ ఎక్కడెక్కడో సంతకాలు పెట్టించాడు.

'ఎంత మోసం. మొగుడు కదా అని ఆ కాగితాలు సరిగ్గా చూడను కూడా చూడకుండా స్టాంప్ పేపర్లని చూసీ సంతకాలు పెట్టాను. ఇంత దగా చేస్తాడని ఎలా అనుకుంటాను' శారద విలవిల్లాడింది. తాను రెండో పెళ్ళి చేసుకోవడానికి శారదకి అభ్యంతరం లేదనీ, దానికి ప్రతిగా ఇల్లు ఆమెకి చెందేట్లు రాస్తున్నానని ఉన్న స్టాంప్ పేపరు కోర్టులో ప్రొడ్యూస్ చేయడంతో శారద లాయరు ఎంత వాదించినా కేసు నిలవలేదు.




"స్కాండ్రల్, ఎంత తెలివిగా నాటకం ఆడి నన్ను మోసం చేశాడు. చదువులేని దాన్నని నా తెలివి తక్కువతనాన్ని బాగా ఉపయోగించుకున్నాడు. సర్లే చావనీ. ఇప్పుడు వాడెవర్తితో ఉంటే నాకేం! ఉద్యోగం ఊడింది. పరువు పోయి, బజారున పడ్డాడు. మనకది చాలు. ఆ శాస్తి చాలు వాడికి." కసిగా అంది శారద.

* * *

ఓ వారం తర్వాత, శారద ఆఫీసు కాగితాలు చూసుకుంటుంటే ప్రకాశరావు వచ్చాడు. "శారదా! జరిగిందేదో జరిగింది. అంతా మరిచిపోదాం. ఎంతైనా నీ భర్తని. నీ పిల్లల తండ్రిని. నిజమే! నీకు అన్యాయం చేశాను. ఏదో మోజులో పడి నిన్నూ, పిల్లలనీ వదలి వెళ్ళానుగాని తప్పు చేసిన భావం ఒక్క రోజూ నన్ను సంతోషంగా బతకనీయలేదు. నీకూ, పిల్లలకీ దూరమై వెనక్కి రాలేక, నీకు ముఖం చూపలేక ఉండిపోయాను. మనం భార్యాభర్తలం. ఈ బంధం తెంపుకొంటే పోయేది కాదని అర్థం అయింది."

సిగ్గు, లజ్జ లేకుండా రావడమే కాక, తనని ఇంకా నమ్మించాలని తాపత్రయపడుతున్న ప్రకాశరావు వంక చూసి, తాపీగా రాస్తున్న పెన్ను పక్కన పెట్టి, చాలా శాంతంగా ఓ నవ్వు నవ్వింది శారద.

"చూడు మిస్టర్ ప్రకాశరావు! 'భర్త' అన్న పదానికి అర్థం తెలుసా? భార్యా పిల్లలని పోషిస్తూ, సంసార భారం వహించేవాడు అని అర్థం! పెళ్ళి, భర్త అన్న పదాలకి అర్థం తెలిసి ఉంటే ఆ పదం ఇంకా వాడి ఉండేవాడివి కావు. 'భరించువాడు భర్త' మరి 'భరించని వాణ్ణి' ఏమంటారో నాకు తెలియదు. రోడ్డున వెళ్ళేవాడికీ, నీకూ ఇప్పుడు ఏం తేడాలేదు నా దృష్టిలో. నీ నా సంబంధం అంతే ఇప్పుడు. అంత బాధ్యతారహితంగా, దొంగచాటుగా కట్టుకున్న భార్య, చిన్న పిల్లలు ఎలా బతుకుతారు అన్న ఆలోచన లేకుండా



వదిలి వెళ్ళిననాడే నీవు నాకు చచ్చినవాడితో సమం అయ్యావు. ఇప్పుడు ఈ ఇంటినీ, సంసారాన్నీ భరిస్తున్న నేనే ఈ ఇంటికి భర్తని, భార్యని అన్నీ! ఇప్పుడైనా నీవు నా సంపాదన చూసి వచ్చావన్నదీ అర్థం కానంత వెర్రిదాన్ని కాదు. చూడు! పూర్వం గాంధారి అనే మహా పతివ్రత భర్త చూడలేనివి తానూ చూడరాదని కళ్ళకి గంతలు కట్టుకుందట! ఈనాడు మేం గంతలు కట్టుకోకుండానే, ఇంతింత కళ్ళుండీ మీరేం చేస్తున్నా చూస్తూ ఊరకోవాలని మీరు ఆశిస్తే అది అత్యాశ! మేం గుడ్డివాళ్ళమై మీరేం చేస్తున్నా చూడనట్లు పడుండి, మహా పతివ్రతల లిస్టులోకి వెళ్ళాలన్న కోరిక లేదు. మహాపతివ్రతల మన్న బిరుదులు అంతకంటే అక్కరలేదు. మీరేం చేసినా 'నీవే గతి నాథా' అని పడుండాల్సిన అవసరం అంతకంటే లేదు. మీరు పడేసే తిండి మా అంతట మేం సంపాదించుకోగలం అన్నది నా కథ నిరూపించింది. బతకడానికి మాకు చాలానే తోవలున్నాయి. ఆపాటి దానికోసం నే గాంధారిని కాదలచలేదు. నౌ యు గెటౌట్ ఫ్రమ్ హియర్! మళ్ళీ ఈ ఛాయలకి వచ్చే ప్రయత్నం ఎన్నడూ చేయకు." శారద చాలా శాంతంగా గుమ్మం వైపు చేయి చూపిస్తూ అంది. ■